# "అరచేతిలో అభ్యుదయం" గాళ్ళు

విజయనగరం కాకినాడ ఎక్స్‌ప్రెస్ అనకాపల్లి దాటింది. రైలు గేట్ల వల్ల అప్పటికే బోలెడు ఆలస్యం అయింది. పేరుకి ఎక్స్‌ప్రెస్ అయినా తాబేల్లా తారుతూ నడుస్తోంది. నేను రోడ్డుపక్క చెట్లవేపూ, పొలాల వేపూ చూస్తూ కూచున్నాను. "మన ప్రయాణ సాధనాలు గత నూరేళ్ళుగా దాదాపు మారలేదు దిక్కుమాలిన దేశం" అని గట్టిగానే అన్నాడు ఎవరో ఒకాయన. ఎవరూ పట్టించుకోలేదు, ఆ మాట.

చీకటి పడుతోంది. బస్సులో లైట్లు వెలిగాయి.

చ్ప్... చ్ప్..... మ్ప్......

అందరూ అరచేతులు ముద్దులు పెట్టుకున్నారు.

ముందు సీట్లో నీట్‌గా, అతి మోడరన్‌గా డ్రస్ చేసుకున్న ఒక యువకుడు మరో యువకుడితో మాట్లాడుతున్నాడు. మొదటి వాడికి ముప్ఫయ్యేళ్లుంటాయి. మెళ్లో పూసలున్నాయి. ఒక చేతికి వాచీ, రెండో చేతికి పల్చని వెండి కడియముంది. కనుబొమ్మల మధ్య చిన్న తిలకం బొట్టుంది. అతని తలపై సూట్‌కేసుంది. దాని అడ్రెస్‌స్లిప్ ప్రకారం అతను న్యూక్లియర్ ఫిజిక్స్‌లో డాక్టరేట్ అనీ, యూనివర్శిటీలో రీడర్‌గా పని చేస్తున్నాడనీ తెలుసుకున్నాను. రెండోఅతని వయసు పాతికుంటాయి. ఇద్దరికీ ఏం సంబంధమో యతెలీదు . మాటల్ని బట్టి సుపరిచితులేననిపిస్తోంది.

" ఈ అరచేతుల్లో ముద్దులు పెట్టుకోవడం మూఢాచారం అని మార్క్సిస్టు లంటుంటారు. నేను దాన్నెంత మాత్రం అంగీకరించను. ప్రపంచంలోని సమస్త సంపదా సృష్టించే సాధనం ఏది? చెయ్యి, అవును కదా, ఈ మాట మార్క్స్ సైతం కాదనలేడు. మరి చెయ్యి ముద్దు పెట్టుకోవడం అంటే మన కృషిని, మన ఉత్పత్తి సాధనాన్ని మనం గౌరవించుకోవడం అన్నమాట."

"కరాగ్రే వసతీ లక్ష్మీ అంటారు గదా"

"దానర్థం ఏమిటీ? లక్ష్మి అంటే సంపద. సంపద అంటే ఉత్పత్తుల వల్ల ఏర్పడేది. ఆ ఉత్పత్తులు ఎలా వస్తున్నాయి.? చేతుల్తో పనిచెయ్యడంవల్ల – మానవజాతి అభ్యుదయం సర్వం అరచేతిలో ఉందన్నమాట. అదీ అందులో రహస్యం".

అతని వైఖరి చిత్రమనిపించింది. ఇలా సమర్థించాలనుకుంటే అన్ని మూఢనమ్మకాలనూ శాస్త్రీయమైనవేనని సమర్థించవచ్చు అనుకున్నాను.

ఇంతలో వాళ్లకన్నా ముందు సీట్లో ఉన్నతను వెనక్కి తిరిగి

"మన సమస్త కండరాలూ– రక్తం ఇదంతా మన శక్తికి మూలం. ఆ శక్తే ఉత్పత్తులను తయారు చేస్తుంది... ఒక చెయ్యినే ముద్దు పెట్టుకోవడం ఏమి? మీ అభిప్రాయం సరైంది కాదు." అన్నాడు ఘాటుగా.

ఎక్స్‌ప్రెస్ యలమంచిలి దాటింది. తుని దాటింది. "అరచేతిలో అభ్యుదయ" వాదితో ఆ పెద్ద మనిషి వాదిస్తూనే ఉన్నాడు. మరికొందరు కూడా ఆయనకి సాయం చేశారు. అన్నవరం రాబోతోంది. అందరూ మళ్లీ గాలిలోకి దణ్ణాలువిసురుతున్నారు. "ఇందులో కూడా బోలెడు శాస్త్రీయమైన ఆలోచన ఉన్నదని అంటారా!" అన్నాడు ముందున్న పెద్ద మనిషి 'అరచేతిలోఅభ్యుదయం' గాళ్ల మీద అతనికి కోపంగా వుంది. న్యూక్లియర్ డాక్టరేట్ ఏమని జావాబిచ్చేవాడో? దిగవలసిన స్టేజి వచ్చేసింది కాబట్టి సూట్ కేసు అందుకుని చకచకాదిగి వెళ్లిపోయాడు.


*రచన : ఆగస్టు 86,*

*ప్రచురణ : ఆంధ్రభూమి (నేటికథ), 24-11-1986.*